# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక





సంపుటి :12 సంచిక :290 ఆదివారం 21-6-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/




## హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

- లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం
- హైడ్రాపై దుష్ప్రచారం తగదు
- మీడియా సమావేశంలో కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్
హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని, కాని దుష్ప్రచారంతో అడ్డుకోరాదని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడామని వివరించారు. శనివారం హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని

-మిగతా 2 లో

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

**ఉరుములు, పిడుగులతో ముంచెత్తనున్న వానలు**

- తెలుగు రాష్ట్రాల్లో నేటి నుంచి చల్లబడనున్న వాతావరణం
- రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన
- హైదరాబాద్‌లో రాత్రి పూటమారనున్న వాతావరణం

హైదరాబాద్
తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రుతుపవనాలు ఎంట్రీ ఇచ్చినా, అక్కడక్కడ మాత్రమే వర్షాలు కురిశాయి.. అయితే, నేటి నుంచి వాతావరణం పూర్తిగా చల్లబడనుంది, ఇరు రాష్ట్రాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని

-మిగతా 2 లో



# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా



### తెలంగాణ పాడి పరిశ్రమను లాభసాటిగా మారుస్తాం

- 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు
- పాడి రైతులకు బకాయిలు లేని చెల్లింపులు
- లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్
రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయా డైరీనీ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజాప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటను ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఉప

-మిగతా 2 లో



## టికెట్ లేకపోతే ఫైన్ డబుల్!.

- వచ్చే నెల1 నుంచి అమల్లోకి
- జరిమానాను రూ.250 నుంచి రూ500కు పెంచిన రైల్వే శాఖ

న్యూఢిల్లీ -
టికెట్ లేకుండా రైలు ప్రయాణం చేస్తే ఇక నుంచి డబుల్ పెనాల్టీ కట్టాల్సిందే. రైల్వేశాఖ టికెట్ లేని ప్రయాణాలపై విధించిన ఫైన్‌ను రెట్టింపు చేసింది. ఇప్పటి వరకు రూ.250గా ఉంటే ఇప్పుడు రూ.500కు పెంచింది. జూలై 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. టికెట్ లేకుండా ప్రయాణిస్తే, వారు ప్రయాణం చేసిన దూరం వరకు అసలు టికెట్ ధరపై ఇక నుంచి రూ.500 చెల్లించాల్సిందే. ఒకవేళ ప్రయాణికుడు ఏ స్టేషన్‌లో ఎక్కాడో స్పష్టత లేకుంటే.. రైలు ప్రయాణం ప్రారంభమైన స్టేషన్ నుంచి ధర చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఇతరుల పేరుమీద టికెట్ బుక్ చేసుకుని ప్రయాణం చేస్తే ఆ టికెట్ చెల్లదు. ప్రయాణికుడు రూ.500 కట్టాలి.లేదంటే న్యాయపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రయాణికులు లేదా చిరు వ్యాపారులు ఎవరైనా సరే అనుమతి లేకుండా రైళ్లలో, స్టేషన్లలో ఆహార పదార్థాలు అమ్మితే రూ.2 వేలు జరిమానా విధిస్తారు.

-మిగతా 2 లో



## బండి భగీరథకు ఊరట

- పోక్సో కేసులో వారం రోజుల మధ్యంతర బెయిల్..
- ఇంజనీరింగ్ పరీక్షలు రాసేందుకు అనుమతించిన మేడ్చల్-మల్కాజిగిరి కోర్టు

తెలంగాణ బ్యూరో :
పోక్సో కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న బండి భగీరథకు న్యాయస్థానంలో తాత్కాలిక ఊరట లభించింది. ఇంజనీరింగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు వీలుగా మేడ్చల్–మల్కాజిగిరి కోర్టు ఆయనకు వారం రోజుల పాటు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కోర్టు నుంచి బెయిల్ ఉత్తర్వులు వెలువడటంతో శనివారం మధ్యాహ్నం భగీరథ చర్లపల్లి సెంట్రల్ జైలు

-మిగతా 2 లో






## పీఎం కిసాన్ డబ్బులు విడుదల

- రైతుల ఖాతాల్లో రూ.18,880 కోట్లు జమ
- హుగ్లీ వేదికగా బటన్ నొక్కి నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ
- దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతు కుటుంబాలకు లబ్ధి
- ఏటా మూడు విడతల్లో రూ.6,000 పెట్టుబడి సాయం
- ఇ-కేవైసీ చేసుకున్న వారికే పీఎం కిసాన్ సొమ్ము

కోల్‌కతా
పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం-కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ది చేకూరింది. కేందప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని

-మిగతా 2 లో

## హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసివేసిన ఇరాన్



- లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులే కారణమని వెల్లడి
- అమెరికాతో శాంతి ఒప్పందం కుదిరిన కొద్దిరోజులకే కీలక నిర్ణయం
- కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించిందన్న ఇరాన్ మిలిటరీ
- శనివారం దక్షిణ లెబనాన్‌పై డ్రోన్ల దాడి.. ఇద్దరు పిల్లలు సహా 16 మంది మృతి
- దాడులు ఆపకుంటే మరిన్ని కఠిన చర్యలు తప్పవని ఇరాన్ హెచ్చరిక

న్యూఢిల్లీ
ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. హోర్ముజ్ జలసంధిని మరోసారి మూసివేసింది. అమెరికాతో శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇరాన్ మళ్లీ హోర్ముజ్‌ను మూసేసింది. దీనికి కారణం ఇజ్రాయెల్. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు జరపడమే ఇందుకు కారణం. శనివారం కూడా దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడిచేసింది. అమెరికాతో కుదుర్చుకున్న శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఇజ్రాయెల్ దాడులు చేసినందుకే హోర్ముజ్‌ను మూసేస్తున్నామని ఇరాన్ ప్రకటించింది. ఈ మేరకు ఇరాన్ జాయింట్ మిలిటరీ టాప్ కమాండ్ అయిన ఖతమ్ అల్ అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ ప్రకటించింది.అంతేకాదు.. ఇజ్రాయెల్ చర్యలపై ఇది ప్రాథమిక స్పందన మాత్రమే అని, ఇకపై దాడులు ఆపకుంటే,

-మిగతా 2 లో

బెంగాల్‌లో ప్రజాధనాన్ని దోచుకున్న

## వారు జైలుకు వెళ్లాల్సిందే:



2

## అనర్హులను ఏరివేయడమే సర్ లక్ష్యం

అదే సందర్భంలో అర్హులకు అన్యాయం జరగనివ్వం

- ఒక వర్గం ఓట్లను తొలగిస్తారనేది అపోహ మాత్రమే
- కుల, మతాలకతీతంగా ఎన్యూమరేషన్ ఫారాల అందజేత
- ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఓటు నమోదు చేసుకోవాలి
- మ్యాపింగ్ అయిన వారు ఆధారాలు సమర్పించాల్సిన అవసరం లేదు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

-హైదరాబాద్
తెలంగాణ రాష్ట్రంలో అనర్హులను ఏరి వేయడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ లక్ష్యమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాంను బీఎల్ఓ అందజేస్తారని తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుందన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమనీ.. ఓటర్లను తొలగించడం కాదని స్పష్టం చేశారు. 24 ఏండ్లుగా రాష్ట్రంలో ఓటర్ జాబితా నవీనీకరణ జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారనీ, కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడానికే ఎన్నికల సంఘం సర్‌ను చేపట్టిందని చెప్పారు.

-మిగతా 2 లో





## కాంగ్రెస్ నేతల కాలర్ పట్టుండి

- పంటలు కొనకుంటే నిలదీయండి
- బోనస్, రైతుబంధు ఏమైందో అడగండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆదిలాబాద్:–
పంటలను కొనుగోలు చేయకపోతే రైతులు కాంగ్రెస్ నేతలను కాలర్ పట్టి నిలదీయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ఏమైందో, రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదో అడగాలని సూచించారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన రైతు పాండురంగ కుటుంబాన్ని శనివారం కేటీఆర్ పరామర్శించారు. రూ. 3 లక్షల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం నేరడిగొండలో నిర్వహించిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతు సమస్యలను

-మిగతా 2 లో



## కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి మరో లేఖ

- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- హైదరాబాద్ మెట్రో రైల్ సమస్యల పరిష్కారానికి కేంద్రం జోక్యం కోరిన సీఎం
- సోమ, మంగళవారాల్లో ఢిల్లీ పర్యటనలో ఉండనున్న రేవంత్ రెడ్డి
- జూన్ 16న రాసిన లేఖలోని అంశాలను గుర్తుచేసిన ముఖ్యమంత్రి
- ఐఆర్‌ఎఫ్‌సీ ఫైనాన్సింగ్, రుణ ఒప్పందాలపై చర్చించడమే లక్ష్యం
- మెట్రో టేకోవర్, ఫేజ్ 2 ప్రతిపాదనల ప్రతులతో ఢిల్లీకి సీఎం
- సమావేశం ఏర్పాటు చేసి తనకు సమాచారం ఇవ్వాలని కిషన్‌రెడ్డికి కోరిన రేవంత్

హైదరాబాద్–
మెట్రో ఫేజ్–2కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మరో లేఖాస్త్రం సంధించారు. మెట్రో ఫేజ్–2, ఐఆర్‌ఎఫ్‌సీ ఫైనాన్సింగ్‌కు సంబంధించిన అంశాలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయాలని సీఎం కిషన్ రెడ్డిని కోరారు. ఈమేరకు శనివారం సీఎం మరో లేఖ రాశారు. జూన్ 16న తాను రాసిన లేఖలో హైదరాబాద్ మెట్రో రైల్‌కు సంబంధించిన

-మిగతా 2 లో

## హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

మొదటి తరువాయి

స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగనాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా? లేదా? పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళ్తుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తోందని రంగనాథ్ పేర్కొన్నారు.

## బండి భగీరథకు ఊరట


మొదటి తరువాయి



నుంచి విడుదలయ్యారు. భగీరథ ప్రస్తుతం ఇంజనీరింగ్ చదువుతున్నారని, త్వరలో ఆయనకు పరీక్షలు ఉన్నాయని ఆయన తరఫు న్యాయవాదులు పిటిషన్ ద్వారా కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షలు రాసేందుకు అనుమతించాలని కోరారు. న్యాయవాదుల వాదనలు విన్న న్యాయమూర్తి, వాటిని పరిగణనలోకి తీసుకుని ఈనెల 26వ తేదీ వరకు భగీరథకు మధ్యంతర బెయిల్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే బెయిల్ కాలంలో న్యాయస్థానం విధించిన షరతులను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

మొదటి తరువాయి



వాతావరణ శాఖ తెలిపింది. ఏపీలోని ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలపై వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండబోతోంది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వానలు కురుస్తాయి. తెలంగాణలో నేడు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా సెంట్రల్, దక్షిణ తెలంగాణ జిల్లాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట్, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణ పేట్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, జనగాం, కామారెడ్డి జిల్లాల్లో సాయంత్రం నుండి అర్ధరాత్రి సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో కూడా పగటిపూట ఎండ ఉన్నప్పటికీ.. రాత్రి సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే ముప్పు ఉందని వెదర్ రిపోర్ట్స్ చెబుతున్నాయి.

## టికెట్ లేకపోతే ఫైన్ డబుల్!.

మొదటి తరువాయి

రైళ్లు, రైల్వే స్టేషన్లలో భిక్షాటన నిషేధం. రైలు నిబంధనలు పదే పదే ఉల్లంఘిస్తే జైలుశిక్ష విధిస్తారు. మహిళలకు కేటాయించిన బెర్తులు, కోచ్‌లలో పురుషులు కూర్చుంటే రూ.2500 జరిమానా విధిస్తారు. తోటి ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించినా, దూషించినా భారీగా పెనాల్టీ వేస్తారు.

## పీఎం కిసాన్ డబ్బులు విడుదల

మొదటి తరువాయి




ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్దిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్దిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

## పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

మొదటి తరువాయి

ఉపముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎంతో పాటు పశు సంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ
జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాల వినియోగం, కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన మేరకు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.ల్ల÷తుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలన్నారు. రైతులకు బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడతారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే.. వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది.. డైరీకి నమ్మకంతో పాలు పోస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్దతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

## బెంగాల్‌లో ప్రజాధనాన్ని దోచుకున్న వారు జైలుకు వెళ్లాల్సిందే:




**కోల్‌కతా,**

పశ్చిమ బెంగాల్‌లో ఎవరైతే ప్రజాధనాన్ని దోచుకున్నారో వారు ఇప్పుడు దానిని తిరిగి ఇచ్చేసి జైలు శిక్షను అనుభవించాల్సి వస్తున్నదని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో శనివారం జరిగిన పశ్చిమబెంగ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వాలు రాష్ట్ర అభివృద్ధికి ఆటంకాలు కలిగించడమే కాక, ఉద్యోగావకాశాల కోసం బెంగాల్ వదిలి వెళ్లాల్సిన దుస్థితిని కల్పించాయని అన్నారు.గత ప్రభుత్వాలు ఎలా పనిచేశాయో మనం కండ్లారా చూశాం. వారు బెంగాల్‌ను వెనుకబాటుతనంలోకి నెట్టేసి మహా నిర్గమన రాష్ట్రంగా మార్చేశారు' అని అన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్లడానికి ప్రయత్నాలు ప్రారంభించిందని, ప్రస్తుతం బెంగాల్‌లో తాజాగా ఆశావహ దృక్పథం కనిపిస్తున్నదని అన్నారు.

## హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసివేసిన ఇరాన్

మొదటి తరువాయి

పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇంకా కఠిన చర్యలు తీసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. దాడులు కొనసాగితే తీవ్ర పరిణామాలుంటాయని వార్నింగ్ ఇచ్చింది. ఈ నిర్ణయం ప్రపంచానికి షాకింగే. ముఖ్యంగా పశ్చిమాసియాపై ఇరాన్ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఇరాన్ నిర్ణయంతో అక్కడి నౌకల కదలికలు నిలిచిపోయాయి. లెబనాన్‌పై శనివారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 16 మంది మరనించారు. వీరిలో ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఇంతకుముందే శుక్రవారం ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అటు అమెరికా, ఇరాన్ మధ్య, ఇటు లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ.. ఇజ్రాయెల్ శనివారం డ్రోన్లతో దాడి చేయడం సంచలనంగా మారింది. మరోవైపు ఇజ్రాయెల్ దాడులపై అమెరికా కూడా అసహనం వ్యక్తం చేస్తోంది. శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత కూడా దాడులు చేయడాన్ని తప్పుబడుతోంది. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు కీలక సూచన చేశారు. నెతన్యాహు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నెతన్యాహు తనకు చాలా మంచి మిత్రుడు అని, అయితే, ఆయన చర్యలను అడ్డుకోక తప్పదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తాజాగా హోర్ముజ్‌ను మూసేస్తూ ఇరాన్ తీసుకున్న నిర్ణయంపై అమెరికా ఎలా స్పందిస్తుందో చూడాలి.

## అనర్హులను ఏరివేయడమే సర్ లక్ష్యం

మొదటి తరువాయి

ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ లేదనీ, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కులం, మతంతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఓటర్ నమోదు ఫారం ఇస్తారని తెలిపారు.
ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసరం లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.
జులై 25 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం
జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటి సర్వే నిర్వహిస్తారని ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి చెప్పారు. జులై 1న ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురణ, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కారం అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఈఆర్‌ఓ, బీఎల్‌ఓలకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసినట్టు వెల్లడించారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటిని సందర్శించి రెండు ప్రతుల ఓటరు నమోదు ఫారాలను అందజేస్తారనీ, అందులోని కాలాలన్నింటినీ పూరించి తిరిగి అందజేయాలన్నారు. బీఎల్‌ఓ ఇంటిని సందర్శించినప్పుడు ఇంటికి తాళం వేసి ఉంటే, కనీసం మూడు సార్లు సందర్శిస్తారని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఓటర్ నమోదు ఫారం అందజేయకుంటే వారు ఓటర్‌గా నమోదు కారని స్పష్టం చేశారు. సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించేందుకు భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అదికారులు కచ్చితంగా పాటించాలని ఆదేశించినట్టు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు స్వచ్ఛంద కార్యకర్తలతో సమన్వయం చేసుకుని పారదర్శకంగా నమోదు ప్రక్రియను చేపడతారని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో కనీసం వారానికి ఒకసారి సమీక్షా సమావేశాలను నిర్వహించి అవగాహన కార్యక్రమాలను చేపడతామని చెప్పారు.

**పూర్తి సమాచారం ఇవ్వని వారికి నోటీసులు**

బీఎల్‌ఓలు పంపిణీ చేసిన ఓటర్ నమోదు ఫారంలో పూర్తి సమాచారం పొందు పర్చని వారికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. వారి నుంచి వచ్చే సమాధానం ఆధారంగా నిబంధనల మేరకు వారి ఓటు నమోదుపై ఈసీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అలాగే నిర్దిష్ట సమయంలో నమోదు ఫారం సమర్పించలేని ఓటర్లు, క్లెయిమ్ లు, అభ్యంతరాల కాలంలో నిర్దేశిత ప్రకటన ఫారంతో పాటు ఫారం-6 సమర్పించి పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలు సమర్పించని ఓటర్ల విషయంలో ఈఆర్‌వో, ఏఈఆర్‌వోలు విచారణ చేస్తారని తెలిపారు.

?సర్ మ్యాపింగ్ తప్పని సరి కాదు
సర్ మ్యాపింగ్ తప్పని సరి కాదనీ, మ్యాపింగ్ అయిన వారు ఈసీ గుర్తించిన ఆధారాలు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. ఓటర్ల పేరు లేదా తమ తల్లిదండ్రులు, తాత లేదా అమ్మమ్మ పేర్లు 2002 ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితాలో ఉన్నట్లయితే వాటి వివరాల ఆధారంగా బీఎల్‌ఓ మ్యాపింగ్ చేస్తారని తెలిపారు. సర్‌లో నమోదు కాని వారు తమ స్థానికతను రుజువు చేసుకునేందుకు ఆధార్ కార్డు మినహా 11 గుర్తింపు కార్డులు చెల్లుబాటు అవుతాయని పేర్కొన్నారు. అందులో ఏదైనా ఒక కార్డును బీఎల్‌ఓకు సమర్పించాలని తెలిపారు.

?రాష్ట్రంలో సర్ షెడ్యూల్....
ఇంటింటి గణన....... జూన్ 25 నుంచి జులై 24 వరకు
ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ ............ జులై 31
అభ్యంతరాల దాఖలు ....... జులై 31 నుంచి ఆగస్టు 08 వరకు
అభ్యంతరాల పరిష్కారం......... జులై 31 నుంచి ఆగస్టు 28 వరకు
తుది ఓటరు జాబితా ప్రచురణ.................. అక్టోబర్ 1

## కాంగ్రెస్ నేతల కాలర్ పట్టుండి

మొదటి తరువాయి

విస్మరిస్తున్న ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని వ్యాఖ్యానించారు. రైతులు పండించిన పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు కేంద్రం కోటా ప్రకారమే అని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు. రైతుబంధు బకాయిలు, బోనస్, పంటల కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం స్పష్టత లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే కొనుగోళ్లు పూర్తి చేసి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
ఎస్‌ఈఆర్ పై అప్రమత్తంగా ఉండాలి
ఓటరు జాబితా ప్రక్షళన అంటూ చేపడుతున్న ఎస్‌ఈఆర్ ప్రక్రియపై అనేక అనుమానాలున్నాయని కేటీఆర్ అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల పేర్లు తొలగినట్లు ప్రచారం జరిగిందని, తెలంగాణలో కూడా అలాంటి పరిస్థితులు తలెత్తకుండా పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే ప్రక్రియలో ప్రతి బూత్ స్థాయిలో ఓటరు జాబితాను పరిశీలించాలని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ప్రశాంత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, సంజయ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి మరో లేఖ

మొదటి తరువాయి



సమస్యలను ప్రస్తావించానని గుర్తుచేశారు. పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం అవసరమని, అందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరినట్టు తెలిపారు. సోమ, మంగళవారాల్లో తాను ఢిల్లీలో ఉంటానని, ఆ సమయంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డిని కోరారు. మెట్రో టేకోవర్, ఐఎఫ్‌ఆర్‌సీతో రుణ ఒప్పందాలు, మెట్రో ఫేజ్ 2 ప్రతిపాధనల ప్రతులను కూడా తాను తీసుకువస్తానని సవాల్ విసిరారు. సమావేశం ఏర్పాటు చేసి తనకు సమాచారం ఇవ్వాలని ఆయన కిషన్‌రెడ్డిని కోరారు.

## పాకిస్థాన్‌లో ఐఈడీ పేలుళ్లు..

**- ఏడుగురు మృతి, ముగ్గురికి గాయాలు**




**పెషావర్: జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)**

పాకిస్థాన్ లోని ఖైబర్ ఫుక్తునక్వా ప్రావిన్సులో పేలుళ్ల ఘటన జరిగింది. బన్నూ జిల్లాలోని మర్కా బేరే ఏరియాలో రోడ్డుపై నాటిన ఐఈడీ బాంబులు పేలాయి. ఈ ఘటన ఏడు మంది మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. అయితే ఇప్పటి వరకు ఏ గ్రూపు కూడా పేలుళ్లకు బాధ్యత ప్రకటించలేదు. బన్నూ జిల్లా పోలీసు అధికారి మాట్లాడుతూ.. రోడ్డుపై నాటిన ఐఈడీ పేలడం వల్ల ఓ వ్యాన్‌లో వెళ్తున్న వారిలో అయిదు మంది మృతిచెందారు. రెస్క్యూ మిషన్‌లో భాగమైన మరో వాహనం కూడా ఐఈడీ పేలుడుకు లోనైట్లు పోలీసు అధికారి చెప్పారు. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మృతుల దేహాలను, గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. హాథీ కేల్ గ్రామం నుంచి బన్నూ సిటీకి వెళ్తున్న ప్రయాణికుల వ్యాన్‌ను టార్గెట్ చేస్తూ ఐఈడీ పేలుడు జరిగింది.ఆ ప్రాంతాన్ని సెక్యూర్టీ దళాలు, పోలీసులు చుట్టుముట్టారు. బ్లాస్ట్ సైట్ నుంచి ఆధారాలను సేకరించారు. సీఎం సోహేల్ అఫ్రిదీ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.

## ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో రసాభాస..




**హైదరాబాద్ జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)**

: ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో రసాభాస నెలకొన్నది. ఇజ్రాయిల్ ప్రతినిధి డాన్నీ డాన్, ఐక్యరాజ్యసమితి అధికారి వన్నెసా ఫ్రేజర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. యుద్ధ క్షేత్రాల్లో పిల్లలపై లైంగిక హింస అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఇజ్రాయెల్ ప్రతినిధి, యూఎన్ అధికారి మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం సాగింది. ఇద్దరూ గట్టిగా అరుచుకున్నారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. యుద్ధ క్షేత్రాల్లో లైంగిక హింస నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం నేపథ్యంలో చర్చలో పాల్గొన్న ఇజ్రయెల్ ప్రతినిధి డాన్నీ డానన్ మాట్లాడుతూ .. ప్రమీలా పాట్టెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్‌లో లైంగిక హింస ఘటనలు జరిగాయని, ఆ దేశాన్ని బ్లాక్ లిస్టులో పెట్టాలని ప్రమీలా తన రిపోర్టులో పేర్కొన్నారు.అయితే ఆ నివేదికను ఇజ్రాయెల్ తప్పుపట్టింది. యూఎన్ సెక్రటరీ జనరల్ ఆదేశాల మేరకు ఇలాంటి నివేదికలు తయారు చేశారని డానన్ ఆరోపించారు.

## ఆలయ ప్రాంగణంలో గంజాయి మొక్కలు..

**- షాకైన పోలీసులు**



**తిరువనంతపురం జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)**

ఆలయ ప్రాంగణంలో గంజాయి మొక్కలు చూసి సిబ్బంది షాకయ్యారు. ఎక్సైజ్ శాఖ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. గంజాయి మొక్కలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై దర్యాప్తు చేపట్టారు. కేరళలోని కొట్టాయం జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్రంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 'ఆపరేషన్ థండర్'ను ఎక్సైజ్ శాఖ చేపట్టింది. ఇందులో భాగంగా అధికారులు పలు చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు.కాగా, వకతనం వద్ద ఉన్న మణికండపురం శ్రీ కృష్ణ స్వామి ఆలయ ప్రాంగణంలోని నడక దారి వద్ద రెండు గంజాయి మొక్కలను ఆలయ సిబ్బంది గుర్తించారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, యాంటీ-నార్కోటిక్ స్పెషల్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ దర్శక్ ఆర్ నేతృత్వంలోని బృందం ఆలయానికి చేరుకున్నది. ఆ గంజాయి మొక్కలను పెకలించి స్వాధీనం చేసుకున్నారు.మరోవైపు మే నెలలో జరిగిన ఆలయ ఉత్సవాల సమయంలో ఎవరో ఒక వ్యక్తి ఆలయ ప్రాంగణంలో గంజాయి సేవించి అవశేషాలను అక్కడ పడేసి ఉండవచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఆ అవశేషాల నుంచి గంజాయి మొక్కలు మొలకెత్తినట్లు భావిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెల్లడించారు.

## కూలిన ఆలయం పైకప్పు.. ఏడుగురు మృతి

**పర్భణీ: జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)**

మహారాష్ట్రలోని పర్భణీ జిల్లా మానవత్ తాలూకాలోని యశ్వాడిలో శనివారం నిర్మాణంలో ఉన్న హనుమాన్ ఆలయ పైకప్పు కూలిపోవడంతో ఏడుగురు భక్తులు మృతి చెందారు. మరో 30 మంది గాయపడ్డారు. ఆలయంలో ధార్మిక కార్యక్రమం జరుగుతుండగా ఈ విషాదం చోటుచేసుకున్నది.గాయపడిన వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు మానవత్ తహశీల్దార్ పాండురంగ మోచేవాడ్ తెలిపారు. సహాయక బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, శిథిలాల కింద చిక్కుకున్న భక్తులను వెలుపలికి తీసుకువచ్చి, సమీపంలోని దవాఖానలకు తరలించాయన్నారు.

# డీఎంకేకు మరో షాక్..

**కూటమి నుంచి వైదొలగిన ఐయూఎంఎల్**



**చెన్నై జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)**

తమిళనాడులో ప్రతిపక్షమైన డీఎంకేకు మిత్రపక్షాలు వరుసగా షాక్ ఇస్తున్నాయి. తాజాగా ఆరు దశాబ్దాల పాటు కొనసాగిన రాజకీయ బంధానికి ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ముగింపు పలికింది. డీఎంకే నేతృత్వంలోని కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే భారీ విజయం సాధించడం ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సృష్టించింది. దీంతో పలు పార్టీలు తమ వ్యూహాలను, పొత్తులను మార్చుకున్నాయి.కాగా, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమితో కలిసి పోటీ చేసిన ఐయూఎంఎల్ రెండు స్థానాలు గెలుచుకున్నది. అయితే, ఎన్నికల అనంతరం సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వానికి ఆ పార్టీ మద్దతు ఇచ్చింది. అధికార కూటమిలో చేరడంతో పాటు, రాష్ట్ర మంత్రివర్గంలోనూ ప్రాతినిధ్యాన్ని దక్కించుకుంది.మరోవైపు ఈ పరిణామాల నేపథ్యంలో డీఎంకే కూటమిని వీడటంపై రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఐయూఎంఎల్ నిర్ణయం తీసుకున్నది. డీఎంకేతో 60 ఏళ్ల రాజకీయ బంధాన్ని తెంచుకుంటూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఐయూఎంఎల్ జాతీయ అధ్యక్షుడు కె.ఎం. ఖాదర్ మొహిదీన్ ఈ విషయాన్ని వెల్లడించారు. తమ పార్టీ దాదాపు 60 ఏళ్లుగా డీఎంకే నేతృత్వంలోని కూటమితో కలిసి ప్రయాణించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక సంస్థల ప్రతినిధులుగా ప్రాతినిధ్యాన్ని పొందినట్లు చెప్పారు. అయితే రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయని, అందుకే డీఎంకేను వీడినట్లు ఖాదర్ మొహిదీన్ స్పష్టం చేశారు. 'ద్రవిడ తరహా పాలన కొనసాగుతుందని మేం ఆశించాం. కానీ ప్రజల తీర్పు భిన్నంగా ఉన్నది. టీవీకేకు సంపూర్ణ మెజారిటీ లభించనప్పుడు, రాజకీయ స్థిరత్వాన్ని కాపాడటానికి, తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించే పరిస్థితిని నివారించడానికి ఐయూఎంఎల్ మద్దతు ప్రకటించింది' అని ఆయన అన్నారు.

# ట్రంప్ మాట లెక్కచేయని నెతన్యాహు..

**లెబనాన్‌పై మళ్లీ ఇజ్రాయెల్ దాడులు.. ఐదుగురు మృతి**



**న్యూఢీల్లి జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)**

పశ్చిమాసియాలో యుద్ధాన్ని నివారించి ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి అమెరికా సిద్ధమవుతుంటే.. ఈ ప్రయత్నాలకు ఇజ్రాయెల్ గండికొడుతోంది. లెబనాన్‌పై వరుసగా దాడులు చేస్తోంది. శనివారం కూడా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. దక్షిణ లెబనాన్‌పై ఈ రోజు ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఐదుగురు మరణించారు. హెజ్బొల్లా, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని అమెరికా ప్రకటించిన కొన్ని గంటల వ్యవధిలోనే.. ఇజ్రాయెల్ దాడికి దిగడం విశేషం.ఈ దాడిపై లెబనాన్ మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. దక్షిణ లెబనాన్‌లోని నబాతే జిల్లాలోని అనేక ప్రదేశాలపై ఇజ్రాయెల్ డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేక ఇండ్లు, బిల్డింగులు ధ్వంసమయ్యాయి. ఐదుగురు మరణించారు. ఫిరంగి దాడులు కూడా జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా వరుసగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. అంతకుముందు శుక్రవారం జరిపిన దాడుల్లో కూడా 16 మంది మరణించారు. అనేకమంది గాయపడగా, పలువురు కూలిన బిల్డింగులు, ఇండ్ల శిథిలాల కింద చిక్కుకుపోయారు. అయితే, ఇజ్రాయెల్ దాడులపై అమెరికా ఆగ్రహంగా ఉంది. ఒకపక్క ఇరాన్‌తో అమెరికా శాంతి ఒప్పందం కుదుర్చుకుని, యుద్ధాన్ని ముగించాలని భావిస్తుంటే.. ఇజ్రాయెల్ మాత్రం ఇరాన్ మిత్రదేశమైన లెబనాన్‌పై దాడులు చేస్తోంది. అక్కడ ఇరాన్ మద్దతుతో నడుస్తున్న హెజ్బొల్లా ఉగ్రవాద శిబిరాల్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడి చేస్తోంది. ఈ దాడుల్ని ఇరాన్ ఖండిస్తోంది. ఇజ్రాయెల్ వైఖరి కారణంగా, స్విట్జర్లాండ్‌లో ఇరాన్, అమెరికా మధ్య జరగాల్సిన తుదిదశ చర్చలు కూడా వాయిదాపడ్డాయి. దీంతో ఇజ్రాయెల్ వైఖరిపై అమెరికా ఆగ్రహంగా ఉంది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహుతో ట్రంప్ మాట్లాడారు. శాంతి ఒప్పందం సమయంలో కాస్త బాధ్యతతో వ్యవహరించాలని నెతన్యాహుకు ట్రంప్ సూచించారు. దాడుల్ని వెంటనే ఆపాలని కోరారు. అయినప్పటికీ.. ట్రంప్ మాటల్ని లెక్కచేయకుండా.. ఇజ్రాయెల్ మాత్రం దాడులు చేస్తూనే ఉంది.

# మోనాలిసా దంపతులకు రక్షణ

**పోలీసులను ఆదేశించిన కేరళ హైకోర్టు**



**తిరువనంతపురం జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)**

కుంభమేళా గర్ల్' మోనాలిసాకు భద్రత కల్పించటంపై కేరళ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. మోనాలిసా, ఆమె భర్త మొహమ్మద్ ఫర్మాన్‌కు భద్రత కల్పించాలంటూ పోలీసులను ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. మోనాలిసా, మొహమ్మద్ ఫర్మాన్‌కు ఆన్‌లైన్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి.. మార్చి 11వ తేదీన తిరువనంతపురంలోని అరుమనూర్ ఆలయంలో హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తర్వాత మోనాలిసా వయసుపై తీవ్ర స్థాయిలో విమర్శలు మొదలయ్యాయి. ఫర్మాన్ తన కూతురిని కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకున్నాడని మోనాలిసా తండ్రి మధ్యప్రదేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో 'నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్'కు ఫిర్యాదు కూడా వెళ్లింది. 'నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్' మోనాలిసా వయసుపై దర్యాప్తు చేయగా.. ఆమె మైనర్ అని తేలింది. నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ దర్యాప్తులో బయటపడ్డ విషయాల మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద మోనాలిసా భర్తపై కేసులు

నమోదు చేశారు. మధ్యప్రదేశ్ పోలీసులు ఫర్మాన్‌ను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించగా.. అతడు కేరళ హైకోర్టును ఆశ్రయించాడు. కేరళ హైకోర్టు ఫర్మాన్ ఖాన్‌ను అరెస్ట్ చేయకుండా స్టే విధించింది. ప్రస్తుతం భార్యాభర్తలు ఇద్దరూ కేరళలోనే ఉంటున్నారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందంటూ కొద్దిరోజుల క్రితం మోనాలిసా కేరళ హైకోర్టులో పిటిషన్ వేశారు. మతాంతర వివాహం కారణంగా మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు వ్యక్తుల నుంచి తమకు ప్రాణ హాని ఉందని మోనాలిసా తన పిటిషన్‌లో పేర్కొంది. తమకు భద్రత కల్పించేలా ప్రభుత్వానికి, ఎర్నాకులం సెంట్రల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు ఆదేశాలు ఇవ్వాలని కోరింది. శనివారం మోనాలిసా పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. మోనాలిసా తరఫు న్యాయవాదితో పాటు ప్రభుత్వ ప్లీడర్ వాదనలను విన్న కోర్టు.. పిటిషనర్ ప్రాణానికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని భావించింది. రిట్ పిటిషన్ విచారణ పూర్తయ్యే వరకు మోనాలిసా, ఆమె భర్తకు రక్షణ కల్పించాలని ఎర్నాకులం సెంట్రల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను ఆదేశించింది. తదుపరి విచారణను జులై 10వ తేదీకి వాయిదా వేసింది.

## పార్టీ చీఫ్‌గా వైదొలగనున్న అఖిలేశ్?

**బీజేపీతో ఎస్పీ నేతల సంప్రదింపులు**

**మంత్రి ఓంప్రకాశ్ రాజ్‌భర్ వ్యాఖ్యలు**




**లక్నో జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)**

సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)లో త్వరలోనే తిరుగుబాటు జరగబోతున్నదని, పార్టీ చీఫ్ పదవి నుంచి అఖిలేశ్ యాదవ్ తప్పుకోనున్నారని, ఆ బాధ్యతలను శివపాల్ సింగ్ యాదవ్ చేపట్టనున్నారని ఉత్తరప్రదేశ్ మంత్రి, సుహేల్ దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బీఎస్‌పీ) అధ్యక్షుడు ఓం ప్రకాశ్ రాజ్‌భర్ వ్యాఖ్యానించారు. బైరియాలో విలేకరులతో మాట్లాడిన ఆయన శివసేన, తృణమూల్ కాంగ్రెస్ తరహాలోనే సమాజ్‌వాదీ పార్టీ కూడా పయనిస్తున్నదన్నారు.అఖిలేశ్ యాదవ్ పక్కకు తప్పుకోవలసి వస్తుందని, శివపాల్ సింగ్ యాదవ్ పార్టీని నడిపిస్తారని అన్నారు. బల్లియా నుంచే ఈ తిరుగుబాటు ప్రారంభం కానున్నదని సుహేల్ దేవ్ జోస్యం చెప్పారు. ఎస్పీ ఎంపీ రాజీవ్ రాయ్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిశారని, ఆయన కనుసన్నల్లోనే రాయ్ పార్టీలో తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు.

## మహారాష్ట్రలో మిగిలింది ఒక్క శివసేనే..

**అమిత్ షా వ్యాఖ్యలు**



**ముంబై, జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)**

మహారాష్ట్రలో ప్రస్తుతం ఒక్కటే శివసేన మిగిలిందని.. అదే ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని వర్గం అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. కొల్హాపూర్ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 'ఏక్‌నాథ్ షిండే వర్గం విడిపోయినప్పటి నుంచి నాలుగేండ్లుగా ఏం సాధించిందో అంతా చూశారు.అప్పట్లో షిండే శివసేన వర్గం అని పిలవాల్సి వచ్చేది. ఇప్పుడు మాత్రం ఒక్కటే శివసేన ఉంది' అని అమిత్ షా చెప్పారు. ఉద్ధవ్ ఠాక్రే శివసేన (యూటీబీ) నుంచి ఆరుగురు ఎంపీలు ప్రత్యేక వర్గంగా ఏర్పడ్డ నేపథ్యంలో షా ఈ వ్యాఖ్యలు గమనార్హం. త్వరలోనే ఆరుగురు ఎంపీలు షిండే వర్గంలో చేరి ఎన్డీయేకు మద్దతిస్తారని తెలుస్తున్నది. షిండే వర్గం ఆపరేషన్ టైగర్ పేరుతో ఉద్ధవ్ వర్గాన్ని తమ పార్టీలో చేర్చుకుంటున్నది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# నీళ్ళు..నిధులు..నియామకాలు...నిజంగా సాధించిన రోజే జయశంకర్ సార్ కు నిజమైన నివాళి!

ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఈ పేరు తెలంగాణ గుండె చప్పుడు, 1952 నుంచి 1969 దాకా, 1996 నుంచి 2001 దాకా, 2001 నుంచి 2011 దాకా నాలుగు తరాల నేతలతో, ఉద్యమకారులతో కలిసి పనిచేసి తెలంగాణే శ్వాసగా బతికిన మహోన్నతుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్. తెలంగాణ మొత్తం ఆయన్ను జయశంకర్ సార్ గా గుండెల్లో పెట్టుకున్నారు. నేడు సార్ 15 వ వర్ధంతి!.

**ఈ సందర్భంగా జయశంకర్ సార్ యాదిలో.....**

తెలంగాణ సిద్ధాంతకర్తగా, తెలంగాణ జాతి పితగా పేరుపొందిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ హనుమకొండ జిల్లా, ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామ శివారు అక్కంపేటలో "ఆగష్టు 6, 1934" న విశ్వబ్రాహ్మణ కులం లో జన్మించారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డి పట్టా పొంది, ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు.

1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్- ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పే జయశంకర్ 2011 జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు. జయశంకర్ జ్ఞాపకార్థం గత ప్రభుత్వం జయశంకర్ జిల్లా ను ఏర్పాటు చేసింది. బెనారస్, అలీగఢ్ విశ్వవిద్యాలయాలనుంచి ఆర్థికశాస్త్రంలో పట్టా అందుకున్న జయశంకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశాడు. 1975 నుంచి 1979 వరకు వరంగల్ లోని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. 1979 నుంచి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ రిజిస్ట్రార్‌గా, 1991 నుంచి 1994 వరకు అదే యూనివర్శిటీకి ఉపకులపతిగా పనిచేశాడు. అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమ్జన్సీ కాలంలో ఆయన సీకేఎం కళాశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేశారు. సీకేఎం కళాశాల అంటేనే జిల్లాలో విప్లవ విద్యార్థి ఉద్యమానికి కేంద్రంగా అప్పట్లో పేరుండేంది. విప్లవకవి వరవరరావు లాంటి వాళ్లు ఆ కాలేజీలో అధ్యాపకులుగా వ్యవహరించారు. ఎమ్జన్సీ గడ్డురోజుల్లో ఆయన కళాశాలను నడిపి ఎంతో మంది విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుంచి కాపాడారు. ఆయన అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తుపెట్టుకోవడం సర్వసాధారణమే కానీ ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని పేరుపెట్టి పిలవడం ఒక్క జయశంకర్ కే సాధ్యం




అంటూ ఆయనకు తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ప్రముఖ సాహితివేత్త రామశాస్త్రి కన్నీళ్లపర్యంతమయ్యారు. జయశంకర్ విద్యార్థుల్లో అనేక మంది దేశవిదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ కే. సీతారామావు తదితరులు అనేక మందికి ఆదర్శ గురువు జయశంకర్. తెలంగాణలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశాడు. జయశంకర్ తన ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశాడు. అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్‌నా ఔర్ మర్‌జానా' (ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి, తర్వాత మరణించాలి) అని అనేవాడు. కానీ తెలంగాణ ఏర్పాటు చూడకుండా, పునర్నిర్మాణంలో భాగం కాకుండా, తాను కలలు కన్న నీళ్లు, నిధులు, నియామకాలు పూర్తిగా అందే వరకు ఉండకుండా ముందే వెళ్ళిపోయారు. ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో నిరంతరంగా ప్రవహించిన జీవనది జయశంకర్ సార్. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచినవాడు. తెలంగాణకు జరిగిన అన్నిరకాల అసమానతలను కండ్లారా చూసి సాక్షీభూతుడిగా మిగిలిపోలేదు. ఉమ్మడి పాలకుల పాపాలను ఒక్కొక్కటిగా చిత్రగుప్తుని వలె లెక్కగట్టిండు. తెలంగాణే శ్వాసగా జీవితాంతం బతికి తెలంగాణ రాష్ట్రం భవిష్యత్తు ఎలా ఉండాలో నిర్దేశించిన ముడి సరుకును అందించి వెళ్లారు. ఇప్పుడా ముడి సరుకులో అత్యంత ప్రధానమైన నీరు తెలంగాణ ప్రమాదపు అంచులో ప్రవహిస్తున్నది. గోదావరి, కృష్ణాజలాల విషయంలో ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న నష్టాన్ని భర్తీ చేసే శాశ్వత కార్యాచరణకు దారులు తీయవలసిన అనివార్యత నెలకొన్నది. తెలంగాణలోని ఏ ప్రాంతం ఏ బేసిన్ లో ఉందో? ఏ నది బేసిన్ లో ఏ ప్రాజెక్టు ఉన్నదో అందరి ముందూ అడిగి చెప్పించుకోవాల్సిన ఏలికలు పాలిస్తున్న సందర్భంలో జయ శంకర్ సార్‌ను మరిచిపోకుండా మళ్లీ మళ్లీ గుర్తుచేసుకోవాలి. తెలంగాణ జీవితం పట్ల, తెలంగాణ భాష పట్ల, సంస్కృతి పట్ల జయశంకర్ సార్‌కు ఉన్న లోతైన ఆత్మీయ అవగాహన ఇప్పుడెవరికి ఉన్నది? తెలంగాణ వనరుల పట్ల, వనరుల దోపిడీ, విధ్వంసాల పట్ల జయశంకర్ సార్‌కు ఉండే మ్యాథమెటికల్ అండ్ సైంటిఫిక్ ప్రమాణాలు ఎవరికున్నాయి? ఏ మేధావికి ఉన్నది? నిజానికి మేధావి అంటే తను ఒప్పుకోరు. తెలంగాణ ఉద్యమానికి బుద్ధిజీవులు లేదా మేధావులు ఒక్కటిగా ఉండాలని ప్రయత్నాలు సాగిస్తున్నకాలంలో అనేక సంఘాలు, సంస్థలు ఏర్పడుతున్నాయి. ఆ క్రమంలో కొంతమంది తెలంగాణ 'మేధావుల' సంఘాన్ని ఏర్పాటు చేద్దామని ప్రతిపాదన వస్తే 'మనకు మనమే మేధావులు అనుకుంటే అతి అనిపిస్తది. మేధావులకు బదులు విద్యావంతులు అందాం' అని వారు సూచించటం వల్లనే ఆ ఏర్పడిన సంస్థకు 'తెలంగాణ విద్యావంతుల వేదిక' అని నామకరణం చేసుకున్నారు. 'బోధించు.. సమీకరించు.. పోరాడు' అని దేశ సామాజిక ఉద్యమాలకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నినదిస్తే తెలంగాణ ఉద్యమంలో అదే సమానార్థకంలో 'భావజాలవ్యాప్తి.. ఆందోళన.. రాజకీయ ప్రక్రియ' అనే దశల్ని నిర్ధారించి తెలంగాణ జనశంకరుడయ్యారు. తెలంగాణ ఉద్యమానికి ఆనాడు జయశంకర్ సార్ విద్యావంతుల వర్గంపై ఆధారపడ్డారు. అది ఏ వర్గమైనా జయశంకర్ సార్‌ను ఆమోదించింది. జయశంకర్ సార్ వారసత్వాన్ని వారి కోసం కొనసాగించే బాధ్యత ఇప్పుడు ఎవరు తీసుకుంటారు? రాజకీయ పార్టీలకు వ్యూహ ప్రతివ్యూహాలు ఉంటాయి. జిత్తులమారి ఎత్తుగడలూ ఉంటాయి. వాటి మధ్య తెలంగాణ ప్రయోజనాలు నలిగిపోకుండా బుద్ధిజీవులు, రాజకీయార్థుల ప్రయోజనాలకు అతీతంగా లేదా సమాంతరంగా కేవలం తెలంగాణ కేంద్రంగా నేతృత్వాన్ని అందించగల వారు కావాలి? తెలంగాణ మునుపెన్నడూ లేని అటువంటి లోటును కొంతకాలంగా అనుభవిస్తున్నది. వ్యక్తులు, సంస్థలు శిబిరాలుగా, సమూహాలుగా విడిపోయి ఎవరినీ అంగీకరించలేని స్థాయికి తెలంగాణ విద్యావంతుల సమాజం జారిపోయింది. జయశంకర్ సార్ ను కులసంఘాలకు అంటగట్టే తరుణం, ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలపై ఉద్యమకారులను గుర్తించే కమిటీ వేయడంతో , ఈ సమూహాలు ఇంకా ఎక్కువై కొత్త కొత్త సంఘాలు ఏర్పడుతున్నాయి.. ఆనాడు ఈ కుల సంఘాలు కానీ ఇప్పుడున్న కొత్త సంఘాలు కానీ వాటి నాయకులు ఆనాడు ఏమైపోయారో తెలవదు... జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించి, ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో తిప్పుకుంటూ సంబురపడిపోయే సమూహాలు కాకుండా తెలంగాణకు జయశంకర్ సార్ అందించిన స్ఫూర్తిని గురించిన చింతనాపరుల ఆవశ్యకత ఏర్పడింది. తెలంగాణ గౌరవాన్ని, సమాజ వ్యక్తిత్వాన్ని, ప్రజాస్వామ్యతత్వాన్ని, పవిత్రతను చారిత్రక అంశగా స్వీకరించే సహృదయుల సాంగత్యం తెలంగాణకు ఇప్పుడే ఎక్కువ అవసరంగా కనిపిస్తున్నది. కనుక ఈ వార్ధంతి సందర్భంగా సార్ ఆశయ సాధనకు, నీళ్లు , నిధులు, నియామకాలు మరియు సామాజిక తెలంగాణ కొరకు ప్రతీన పూనుదాం!

జోహార్ ప్రొఫెసర్ జయశంకర్ సార్! జోహార్ .... జోహార్....

పినపాక ప్రభాకర్, రాష్ట్ర కన్వీనర్, కార్మిక సంక్షేమ సంఘం తెలంగాణ.

# బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం

**-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి**

**- బ్రాహ్మణ భవన నిర్మాణానికి స్థలం, ఆర్థిక సహాయం కోరిన సంఘ ప్రతినిధులు**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిని కలిసి బ్రాహ్మణ కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ఉపనయనాలు, వివాహాలు వంటి శుభకార్యాలు నిర్వహించేందుకు తమకు సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. బ్రాహ్మణ సంఘం కోసం వెయ్యి గజాల స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని, సంఘం సమస్యలను పరిశీలించి త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కూడా సంఘ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు సుజీవన్, సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్ర, వేణుగోపాలకృష్ణ, చిలుకూరి రామ్, సత్యనారాయణ శర్మ, ప్రవీణ్ కుమార్, రఘుపతి రావు, రాదేశం, రవి శర్మ, భాను శర్మ, రాజశేఖర్ శర్మ, కమల్ కిషోర్ శర్మ, వసుంధర, రాజగోపాల్, మనోజ్ కుమార్, రాజేష్, సుదర్శన్‌రావు, కృష్ణమోహన్, శ్రీనివాసరావు, కమల, సౌమ్య, శిరీష, గాయత్రి, గీత, న్యాయసలహాదారు నర్వ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో అక్షరాభ్యాస కార్యక్రమ నిర్వహణ



**యాచారం (జూన్ 20).జర్నలిస్ట్ డైరీ.** కొత్తపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో శనివారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ చిక్కుడు వెన్నెల శేఖర్ హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదించారు.

అలాగే ఈ కార్యక్రమం లో పాల్గొన్న గ్రామ ఉపసర్పంచ్ కాలె అనిత రమేష్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం విద్యాభ్యాసం ప్రాముఖ్యతను వివరించి, చిన్నారులు ఉన్నత లక్ష్యాలతో చదువులో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమం ముగిసింది.

# రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో అపరిశుభ్ర శౌచాలయాలు-విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమా?

**-నిర్లక్ష్య తీరుపై ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ సెక్రటరీ శ్రీకాంత్ ఆగ్రహం**

**-ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో అధికారుల వైఫల్యమని విమర్శ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) ;** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన ప్రభుత్వ పాఠశాలల్లోనే అపరిశుభ్రత రాజ్యమేలుతుండటం ఆందోళన కలిగించే అంశమని ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ సెక్రటరీ శ్రీకాంత్ నాయక్ మండిపడ్డారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. పాఠశాలలో శౌచాలయాలు అపరిశుభ్రంగా ఉండడం, తాగునీటి సౌకర్యాలు తగిన స్థాయిలో లేకపోవడం, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులను పరిశీలించిన శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు సంబంధించిన అంశాలను నిర్లక్ష్యం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు. పాఠశాలల పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలు పెరిగాయని వాటిని తొలగించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల అడుగడుగునా నిర్లక్ష్యం వెంటాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో నీటి సమస్య అధికంగా ఉందని విద్యార్థులు తమతో చెప్పారని , ఆ సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వాలు విద్యా రంగ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కూడా అందించలేకపోవడం బాధాకరమని అన్నారు. ముఖ్యంగా బాలికల కోసం పరిశుభ్రమైన శౌచాలయాలు లేకపోవడం వారి విద్యాభ్యాసంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు కేవలం విద్య బోధించే కేంద్రాలు మాత్రమే కాకుండా భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ఆలయాలని పేర్కొన్న ఆయన, అలాంటి చోట్ల అపరిశుభ్రత నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులు అనారోగ్య సమస్యలకు గురయ్యే పరిస్థితులు ఏర్పడితే అందుకు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, శౌచాలయాల నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన మరియు సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పాఠశాలల్లోనే అపరిశుభ్రత ఉంటే అది కేవలం నిర్లక్ష్యం కాదు. భావితరాల ఆరోగ్యంతో చెలగాటమే అని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం, అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ వైస్ ప్రెసిడెంట్ అదిల్ ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్ రామ్ చరణ్, సోహెల్, సన్నీ, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే మోదీ లక్ష్యం

**-పీఎం కిసాన్ 23వ విడత నిధుల విడుదల సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు**

**-ముఖ్యఅతిథిగా హాజరైన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :** కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 23వ విడత ఆర్థిక సహాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాలలో విడుదల చేసిన సందర్భంగా కొందుర్గు మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో రైతు వేదికలో ప్రభుత్వ అధికారులతో కలిసి మోడీ ప్రసంగాన్ని వీక్షించి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకొని ఆనందాన్ని పంచుకున్నారు. రైతుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్న గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, పీఎం కిసాన్ పథకం ద్వారా దేశంలోని కోట్లాది మంది రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందుతోందని, రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మయ్య గౌడ్, గుండేటి శివారెడ్డి, కొమరబండ శ్రీశైలం, సున్నాల అంజయ్య, బోయ శ్రీశైలం, బోయ వీరన్న, బోయ శేఖర్, అంజిరెడ్డి, చంద్రశేఖర్ చారి, శ్రీకాంత్, నరసింహ, బాల్ రెడ్డి, గంగాధర్, కృష్ణ యాదవ్, భాస్కర్ పటేల్, కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మరవదు...

**- సేవను గుర్తించి సముచిత గౌరవాన్ని అందిస్తుంది : నెమలి అనిల్ కుమార్**



**నాగారం, జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులుగా నియమితులైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు దంతూరి రాజు గౌడ్, కోయగుర బాలరాజు గౌడ్, చౌదరిపల్లి పర్వతాలు లని ఉమ్మడి మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ కమిటీలో బాధ్యతలు చేపట్టిన నాయకులకు ఈ పదవులు మరింత బాధ్యతను తీసుకువచ్చాయని, వారి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర సేవాదళ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మునపల్లి సద్గుణ రావు, మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా మాజీ ఓబీసీ అధ్యక్షులు బొంగోని ఉమేష్ గౌడ్, మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులు దంతూరి రాజుగౌడ్, కోయగుర బాలరాజు గౌడ్, చౌదరిపల్లి పర్వతాలు, మల్లాపూర్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి తాండ్రా శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిజి సుదర్శన్, బెల్లం గట్టయ్య, మక్తాల బాలరాజు గౌడ్, బెల్లం శ్రీనివాస్, మెరుపుల బాలరాజ్, సంయుక్త కార్యదర్శి ఉండం శ్రీనివాస, జానీ వేణు, కోయలకొండ రాజేష్, సురేష్ గౌడ్, నరసింహ, జానీ భాయ్, రూపేంద్ర రెడ్డి, విజయ్ రెడ్డి, కటర్ల మహేష్, లక్ష్మీపతి, ఆర్వీ వెంకటేష్, నరేష్ యాదవ్, దాసరి సాయి, శ్రవణ్ గౌడ్, సందీప్, ప్రవీణ్, శ్రీనివాస్ యాదవ్, యాసీన్ భాయ్ గార్లు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు జమీలా బేగం, శైలజా గౌడ్, నిర్మల రెడ్డి, సోని గౌడ్, ఇశ్రత్ బాను, కవిత గార్లు, యువ నాయకులు బాతరాజు రాహుల్, నెమలి సందీప్, సంపత్, వంగవీటి రింకు, శివ ముదిరాజ్, సూరజ్, భాస్కర్, కార్తీక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాం నగర్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనుల ప్రారంభం...



**నాగారం, జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం డివిజన్ పరిధిలోని శ్రీరాం నగర్ కాలనీ వాసుల పిలుపు మేరకు కాలనీలోని రోడ్డు నంబర్-13లో రూ.17లక్షల 70 వేల వ్యయంతో సీసీ రోడ్డు మరియు డ్రైనేజ్ నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు వెంకట్ రెడ్డి, హరి బాబు, సుమిత్ర సురేష్, కందాడి శ్రీనివాస్ రెడ్డి, భద్రు నాయక్, కాలనీ అధ్యక్షులు రాఘవేంద్ర రావు, ఆశిష్, శ్రీకాంత్, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాలనీలో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఈ అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులు మరియు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీరామ్ నగర్,చండీశ్వరనగర్ కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి




**నాగారం, జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం డివిజన్ పరిధిలోని శ్రీరామనగర్ కాలనీ మరియు చండీశ్వర నగర్ కాలనీలలో ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డికి శనివారం ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పంగహరి బాబు, రాంపల్లి మాజీ ఉపసర్పంచ్ పరిగే మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్, మాజీ వార్డ్ సభ్యులు చిరశేఖర్, చండీశ్వర్ నగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఆశిష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కాలనీ వాసులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ ప్రభుత్వంలోనే రైతులకు నిజమైన మేలు

**-షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్**

**-రైతుబంధును ఏకకాలంలో విడుదల చేయాలి. రైతులకు యాప్ అవసరం లేదు.. ఎరువులు అందుబాటులో ఉంచాలి**

**-వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడితే సహించబోం. అన్ని రకాల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో వ్యవసాయ రంగానికి జరిగిన మేలును తెలంగాణ రైతాంగం ఎన్నటికీ మర్చిపోదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులకు అదే స్థాయిలో మేలు చేసే విధంగా పాలన అందించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రైతులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి నాణ్యమైన, అంతరాయం లేని 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించడం వల్ల రైతులు రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లే ఇబ్బందులు తప్పాయని గుర్తు చేశారు. ప్రస్తుతం నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో పాటు విద్యుత్ కోతలు పెరిగాయని ఆరోపించారు. రైతుబంధు పథకం ద్వారా ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.10 వేల పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం వల్ల విత్తనాలు, ఎరువుల కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు పెట్టుబడి సాయం ఏకకాలంలో అందడం లేదని విమర్శించారు. రైతుబంధు నిధులను గతంలో మాదిరిగానే ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బీమా పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతు ఏ కారణంతో మరణించినా వారి కుటుంబ సభ్యులకు వారం రోజుల్లోగా రూ.5 లక్షల బీమా సాయం అందేలా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు.కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, మిషన్ కాకతీయతో పాటు పలు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా బీడు భూములకు సైతం సాగునీరు అందిందని, దీంతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అనేక లిఫ్టులను పూర్తి చేశారని, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు పూర్తికాకపోయినా ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళికలు, చర్యలు గత ప్రభుత్వ హయాంలోనే చేపట్టినట్లు గుర్తు చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు ఆలోచన కూడా కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించిందని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని, ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో కొన్ని రకాల పంటలను మాత్రమే కొనుగోలు చేస్తున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. ప్రభుత్వం అన్ని రకాల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

గతంలో మార్కెట్లకు భారీగా ధాన్యం వచ్చినా కొనుగోలు ప్రక్రియను సమర్థంగా నిర్వహించేవారని, ప్రస్తుతం వచ్చిన కొద్దిపాటి ధాన్యాన్ని కూడా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతులకు న్యాయం జరిగిందని అన్నారు. ఎరువుల కొనుగోలు కోసం యాప్ విధానాన్ని తీసుకురావడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్రంలో ఎంతోమంది రైతులకు చదువు రాకపోవడంతో యాప్ ఆధారిత విధానం వారికి ఇబ్బందికరంగా మారుతుందని, వెంటనే ఆ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎరువుల కొరత ఏర్పడిందని ఆరోపించారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసే ప్రయత్నాలను రైతాంగం సహించబోదని హెచ్చరించిన అంజయ్య యాదవ్, ఈ విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఈట గణేష్, ఎంఎస్ నటరాజన్, లక్ష్మణ్ నాయక్, దేవేందర్ యాదవ్, పెనుముని గోపాల్, చీపిరి రవి యాదవ్, జట్టా కుమార్, యుగంధర్, అశోక్, విశ్వ, రామకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగాన్ని వంచించిన పాలనార్హతలేని ఈ ప్రభుత్వం దిగిపోవాలి

**మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**




**తెలంగాణ బ్యూరో, జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :** పంటలు కొనమని చేతులు ఎత్తేసిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి రాష్ట్ర రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రతి గింజ కొంటాం. విదేశాలకు పంపిస్తాం. రైతులకు మాత్రం కష్టం రానివ్వమని మాట్లాడారు.నాడు ఇబ్బందులు లేకున్నా ఉన్నట్లు చిత్రీకరించి గద్దె దిగిపోవాలని రేవంత్ రెడ్డి కేసీఆర్ ను డిమాండ్ చేశారు .. సిగ్గు, శరం, మానాభిమానాలు ఉంటే తన పదవికి వెంటనే రాజీనామా చేయాలి.లేదంటే అవగాహన లేక, బుద్ధిలేక, సమర్థత లేక ఇలా మాట్లాడాం అని ప్రజలకు క్షమాపణలు చెప్పాలి రాహుల్ గాంధీ సమక్షంలో రైతు డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ జన్మదినం నాడే రాష్ట్ర రైతాంగానికి ఉరితాడు పేనింది ఊరించి, ఊరించి చేసింది మోసం, దగా మాత్రమే. ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలం అయింది 2014 నాటికి గరిష్టంగా 26 లక్షల ఎకరాల లోపు సాగయితే పంటలు కొనుగోలు చేసింది 26 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే .. 2020 బీఆర్ఎస్ హయాంలో 92.68 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాంఈ యాసంగిలో కాంగ్రెస్ సర్కార్ 50 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయడానికే రైతులు రెండు నెలల పాటు కొనుగోలు కేంద్రాలు, రహదారుల పడిగాపులు కాయాల్సి వచ్చింది మొదట మొత్తం ధాన్యం కొంటామని చెప్పారు. ఆ తర్వాత 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటామన్నారు. దాన్ని 70 లక్షల మెట్రిక్ టన్నులకు కుదించారు. చివరకు 50 లక్షల పైచిలుకు మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. కాంటా వేయడానికి నెల రోజులు, కాంటా వేసిన తర్వాత నెల రోజులు వేచిచూడాల్సి వచ్చింది. కాంగ్రెస్ పాలనలో తమ పంటలు కొనుగోలు చేయాలని రైతాంగం అధికారుల కాళ్లు పట్టుకోవాల్సిన దైన్య స్థితిని, దుర్భర స్థితిని రేవంత్ సర్కారు కల్పించింది నాడు కరోనా కష్టకాలంలో కూడా అత్యధికంగా వరి ధాన్యంతో పాటు అన్ని రకాల పంటలను కేసీఆర్ ప్రభుత్వం కొనుగోలు చేసింది ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ధాన్యం కొనుగోళ్ల గురించి రేవంత్ రెడ్డి పొడుగు పొడుగు మాటలు మాట్లాడారు .. కేంద్రం చెప్పిన మేరకు తప్ప అదనంగా మేము కొనలేము అని చేతులు ఎత్తేశారు. రేవంత్ మాట్లాడిన మాటలు ఇప్పుడు, ఆయనకు, ఆయన ప్రభుత్వానికి వర్తిస్తాయి.బీఆర్ఎస్ హయాంలో ధాన్యం కొనుగోళ్ల కోసం కేంద్రాన్ని డిమాండ్ చేశాం. ఢిల్లీలో కేసీఆర్ నాయకత్వంలో ధర్నా చేశాం. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి ధాన్యం కొనుగోళ్ల కోసం వినతిపత్రాలు ఇచ్చాం., కానీ ఎక్కడా రైతుల ధాన్యం కొనకుండా ఆపలేదు. కేంద్రాన్ని బూచిగా చూపి కొనుగోళ్లను ఆపలేదు. కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులకు, ప్రజలకు తెలియాలని ఆందోళనలు చేశాం.

కాంగ్రెస్ పార్టీ మాదిరిగా పలాయనవాదం చిత్తగించలేదు. ఇది దద్దమ్మ ప్రభుత్వం. అసమర్ధ ప్రభుత్వం. నేరపూరిత ప్రభుత్వం. ప్రజల కోసం తపన పడి పనిచేసింది కేసీఆర్ సర్కారు పదేళ్లలేని యూరియా కష్టాలు కాంగ్రెస్ పాలనలో ఎందుకు వస్తున్నాయి. యూరియా సరఫరా చేతగాక యాప్ తీసుకురావడంతో రైతాంగం తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇది ఈ సర్కారు అసమర్ధతకు నిదర్శనం. రాష్ట్ర రైతాంగానికి ఈ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్వింటాలు ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ అని ఊరించారు. అధికారంలోకి వచ్చిన తరువాత సన్నవడ్లకు పరిమితం చేశారు. ఇప్పుడు సన్నరకాలలో కూడా ఏడు రకాలకే పరిమితం చేశారు. సన్నాల సాగు విషయంలో ప్రభుత్వం ఎంతో కుట్ర పూరితంగా వ్యవహరించింది. 28 జనవరిలో సన్నాల సాగు గురించి మెమో విడుదల చేసింది. దానిలో ఎనిమిది రకాల సన్నాలు, మూడు రకాల దొడ్డు వడ్లు మాత్రమే ప్రోత్సహించాలని జీఓ ఇచ్చింది. కానీ దానిని జూన్ వరకు వెల్లడించలేదు. రైతులు నారుమళ్లు పోసుకున్నాక ఏవి సాగు చేయాలో అని వివరాలు వెల్లడించారు. ఇప్పుడు దొడ్డు రకాలను ఎత్తేసి, సన్నరకాలను ఏడింటికే పరిమితం చేశారు.రేపు పంటలు మార్కెట్లోకి వచ్చిన తరువాత తాము ముందేం చెప్పాం అని కొనుగోలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నంలో ఉంది. ఎక్కువ దిగుబడి వచ్చే రకాలనే సాగు చేసేందుకు రైతులు మొగ్గుచూపుతారు. సర్కారు చెప్పిన సన్నాలు సాగుచేస్తే ఎకరాకు రైతులు పది క్వింటాళ్లు దిగుబడి కోల్పోతారు. సర్కారు బోనస్ దేవుడెరుగు ఎకరాకు పది క్వింటాళ్ల నష్టం వస్తుంది.ఈ ప్రభుత్వం రుణమాఫీ అని చెప్పి చేతులు ఎత్తేసింది. రైతుభరోసా విషయంలో చేతులు ఎత్తేసింది. రైతులకు బాకీపడ్డ రైతుభరోసా 29,358 కోట్లు ఈ ఐదు సీజన్లకు కలిపి రైతులకు ఈ ప్రభుత్వం బాకీపడింది. ఎందుకు ఎగ్గొట్టారో సమాధానం చెప్పాలి.రైతుభరోసా ఇవ్వడానికి సభ పెడతారంట. గతంలో రైతులకు ఇచ్చిన హామీలు ఒకసారి గుర్తు చేసుకుని సభ పెట్టాలి ఉన్న కరంటును సరిగ్గా ఇవ్వడం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదు. గత ఏడాది ఈ పాటికి నదులలో నీళ్లు పారాయి. క్రిష్టా, గోదావరి నీటిని ఒడిసిపట్టుకోవడం ద్వారా తెలంగాణ నేలను శాశ్వతంగా కరువు జయించవచ్చని కేసీఆర్ ముందుచూపుతో కాళేశ్వరం ఎత్తిపోతల పూర్తి చేశారు. పాలమూరు రంగారెడ్డికి రూపకల్పన చేశారు. వరసగా నాలుగేళ్లు కరువు వచ్చిన తెలంగాణలో ఇబ్బందిలేకుండా ఉండాలని ప్రయత్నించారు అవగాహన లేక కాళేశ్వరాన్ని కక్షతో, ఈర్శతో వినియోగంలోకి తీసుకురావడం లేదు. 90 శాతం పూర్తయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలలో మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయడం లేదు. కాంగ్రెస్ సర్కారు మూర్ఖత్వం మూలంగా తెలంగాణ రైతాంగం నష్టపోతుంది

ఆకలిని జయించడానికి ఆధునిక దేవాలయాలు బాక్రానంగల్, నాగార్జున సాగర్ లను నిర్మించిన విజనరీ జవహర్ లాల్ నెహ్రూ. ఆత్మవిమర్శ చేసుకోవడంలో మేటి అని ఆయనకు పేరుంది. ఆయన పార్టీకి వారసులు అయిన మీరు రైతులకు చేసిన డిక్లరేషన్ బుట్టాదాఖలు అయింది

రైతుల ప్రయోజనాలను బలిపెట్టి రాష్ట్రంలోని ప్రాజెక్టులను పండబెట్టారు. రైతులు కష్టపడి పంటలు పండిచారు. ఇందులో ప్రభుత్వ ఘనత ఏం లేదు. కరంటు రాకున్నా, రైతుభరోసా ఇవ్వకున్నా, యూరియా ఇవ్వకున్నా అష్టకష్టాలు పడి పంటలు పండించారు.ఇది రైతాంగాన్ని రాచిరంపాన పెడుతున్న ప్రభుత్వం ఇది. తెలంగాణ కరువును జయించే ప్రాజెక్టులను నిర్వహించలేని అసమర్ధ ప్రభుత్వం ఇది.సకాలంలో రూ.441 కోట్ల ప్రీమియం కట్టకపోవడంతో 7600 మంది రైతు కుటుంబాలకు రైతుభీమా పరిహారం అందకుండా పోయింది

అద్భుతమైన పంటల భీమా పథకం తెస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి 30 నెలలు అయినా ఈ పథకం గురించి ఊసెత్తడం లేదు

పంటల భీమా లేదు. రైతుభీమా లేదు. రైతుభరోసా లేదు. ఆఖరుకు పంటల కొనుగోళ్ల విషయంలో చేతులు ఎత్తేసింది.సంధర్భం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్దిచెబుతారు.తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రైతుబంధు సమితి మాజీ చైర్మన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో మట్టి మాఫియా ఆగడాలు..!

**-వందల లారీలతో హైదరాబాద్‌కు విలువైన మట్టి తరలింపు**
**-చెరువులు, పంటకాలువలు కబ్జాలకు గురవుతున్నాయి**
**-పోలీసు--రెవెన్యూ శాఖల మౌనం వెనుక మర్మమేంటి..?**
**-షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆగ్రహం**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్ నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోందని, రైతులకు ఉపయోగపడాల్సిన విలువైన మట్టి వందల లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలిపోతోందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ మట్టి తరలింపుపై పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.షాద్‌నగర్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయానికి ప్రధాన ఆధారాలైన చెరువులు, పంటకాలువలు, వాగులు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల స్వార్థ ప్రయోజనాల కోసం సహజ నీటి వనరులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బొబ్బిలి చెరువులో రైతులకు ఉపయోగపడే సారవంతమైన ఒండ్రు మట్టిని భారీ ఎత్తున తవ్వి వందలాది లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం అందరికీ కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అక్రమ మట్టి రవాణా బహిరంగంగా జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ మట్టి దందాపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని నిలదీశారు. కేశంపేట మండలంలోనూ అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిని వదిలిపెట్టి, తమ సొంత పొలాల్లో వ్యవసాయ అవసరాల కోసం మట్టి పోసుకుంటున్న రైతులను మాత్రమే వేధించడం దురదృష్టకరమని విమర్శించారు. నియోజక వర్గంలోని ఎర్రమట్టి, నల్లమట్టి, విలువైన మొరం వంటి సహజ వనరులు పెద్ద ఎత్తున రాజధాని ప్రాంతానికి తరలిపోతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. వెంటనే అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఈట గణేష్, ఎమ్మెస్ నటరాజన్, లక్ష్మణ్ నాయక్ దేవేందర్ యాదవ్ పెనుముని గోపాల్ చీపిరి రవి యాదవ్ జట్టా కుమార్, యుగంధర్, అశోక్ విశ్వ రామకృష్ణ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు హెల్త్ కార్డులు పంపిణీ



**నాగారం, జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)** కెఎస్ఎస్ చారిటబుల్ హెల్త్ కేర్ సెంటర్ -- హెల్త్ కార్డ్ పంపిణీ కార్యక్రమం శనివారం కాప్రా డివిజన్ పరిధిలోని బంజారా కాలనీలో జరిగింది. 100 నిరుపేద కుటుంబాలకు కెఎస్ఎస్ చారిటబుల్ హెల్త్ కేర్ సెంటర్ హెల్త్ కార్డులను కెఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నయీమ్ సహకారంతో గోగికర్ శివకుమార్ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది.
ఈ హెల్త్ కార్డుల ద్వారా కొన్ని గుర్తింపు పొందిన హాస్పిటల్స్‌లో వైద్య సేవలపై 50% వరకు ప్రత్యేక రాయితీ (డిస్కౌంట్) పొందే అవకాశం ఉంటుందని, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఈ కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నాయి వారు పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యమే మా ప్రాధాన్యం -- కాప్రా డివిజన్‌లో ప్రతి బీద కుటుంబానికి ఆరోగ్య భరోసా అందించడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**నాగారం, జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం డివిజన్ పరిధిలోని శిల్ప నగర్ కి చెందినటువంటి బాలరాజు గౌడ్ కు సీఎం రిలీఫ్ ఫండ్ 2 లక్షల రూపాయలను నాగారం మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కౌకుట్ల చంద్ర రెడ్డి శనివారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బీజ్జ శ్రీనివాస్ గౌడ్, నక్క కిషోర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# లింగంపల్లి విలేజ్ లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లి విలేజ్ లో రూ. 35.00 ముప్పై ఐదు లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను యాదవ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, తాజా మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, నార్నె శ్రీనివాసరావు, కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పియేసి చైర్మన్ అరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ లింగంపల్లి విలేజ్ లో 35 లక్షల రూపాయలతో అన్ని హంగులతో ,సకల సౌకర్యాలతో కమ్యూనిటీ హాల్ ను నిర్మించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, లింగంపల్లి విలేజ్ వారు ఇతర కాలనీ లకు ఆదర్శంగా నిలిచారు అని, భవనంను త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి ఈ రోజు అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమైన విషయం అని ,కమ్యూనిటీ హాల్ ను కాలనీ సంక్షేమం , అభివృద్ధి కోసం చక్కగా సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్ లో సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు , జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా భవనం నిర్మించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. కాలనీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని , మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధం అని ,ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి వచ్చిన పరిష్కరిస్తానని తెలియచేశారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, కాలనీ ని అన్ని రంగాలలో ఆదర్శవంతమైన విలేజ్ గా తీర్చిదిద్దడం జరిగినది అని, అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం జరిగినది అని, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, లింగంపల్లి విలేజ్ ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచింది అని



తెలియచేసారు . శేరిలింగంపల్లి డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయ షెక్తుల కృషి చేస్తానని తెలియచేస్తారు.లింగంపల్లి విలేజ్ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని, అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది అని , లింగంపల్లి విలేజ్ లో పూర్తి స్థాయిలో పనులు జరిగాయి అని, ఒకప్పటి లింగంపల్లి అండర్ పాస్ సమస్య శాశ్వత పరిష్కారం చూపమని, త్వరలోనే ట్రాఫిక్ రహిత సమాజం కోసం ROB ఫ్లై ఓవర్ ను నిర్మించి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, సంక్షేమం తో పాటు అభివృద్ధి కొనసాగిస్తామని అన్నారు. ఏ చిన్న సమస్య ఆయిన తన దృష్టికి గాని తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని ,మీకు ఎల్లవేళలో అందుబాటులో ఉంటామని తెలియచేసారు.అనంతరం లింగంపల్లి విలేజ్, వెంకట్ రెడ్డి కాలనలో నెలకొన్న పలు సమస్యలపై పాదయాత్ర చేస్తూ పర్యవేక్షించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రఘునందన్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ రాజు యాదవ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మి నారాయణ గౌడ్, జి జనార్ధన్ రెడ్డి, కే రాంచందర్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్,లింగంపల్లి విలేజ్ డెవలప్మెంట్ కమిటీ ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్, వార్డు మెంబర్ కవిత, వార్డు మెంబర్ శ్రీకళ, వార్డు మెంబర్ రాము, లక్ష్మణ్ యాదవ్, శ్రీకాంత్ దేవులపల్లి, రాజ్ కుమార్, రవీందర్, రమేష్, రవి, సాయన్న, రాజారెడ్డి, కోదండరాం, పాండు ముదిరాజ్, గఫూర్, పొట్ట మల్లికార్జున్, బాలరాజ్ యాదవ్, సత్యనారాయణ యాదవ్, నర్సింహా, కుమార్, వెంకటేశ్వర్లు, ఖాజా పాషా, అజీమ్, మహేందర్ సింగ్, మొయిస్, రాజు యాదవ్, రవి, అహ్మద్, శేఖర్, జ్ఞానేశ్వర్, రేణుక, రాజు, స్రవంతి, ఖంసమ్మ, బసుదేవ్, కిషోర్ యాదవ్, పులి సాయి, శివరాం యాదవ్, రఘు యాదవ్, భరత్ గౌడ్, హరీష్ యాదవ్, రేవంత్, నరేష్, కిరణ్ ముదిరాజ్, సల్మాన్, కే విజయ్ యాదవ్, హరీష్ ముదిరాజ్, మహేష్ దేవులపల్లి మహిళలు చంద్రకళా, సుజాత, కుమారి, కళ్యాణి, లక్ష్మి, ముంతాజ్ బేగం, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు..

**● పేదల సొంతింటి కల సాకారం చేస్తాం: చింతల చంద్రారెడ్డి**



**హాలియా, జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా గూడు లేని పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు. శనివారం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇల్లు అవసరమైన నిజమైన పేద కుటుంబాలనే అర్హులుగా గుర్తించి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ఒక్క కుటుంబానికి కూడా అన్యాయం జరగకుండా ప్రత్యేక శ్రద్ధతో ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. పేద ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, వారి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా హాలియా మున్సిపాలిటీ పరిధిలో ఇల్లు లేని ప్రతి అర్హ కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు వేగవంతంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# నల్లగండ్లలో రూ. 30 లక్షలతో మంజీర పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల లో రూ. 30 లక్షల రూపాయల అంచనావ్యయం తో నూతనంగా చేపట్టబోయే మంజీర మంచి నీటి పైప్ లైన్ నిర్మాణము పనులకు తాజా మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, నార్నె శ్రీనివాసరావు తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ
ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.... శేరిలింగంపల్లి నియోజకవర్గం లో మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రతి ఇంటింటికి స్వచ్ఛమైన మంచి నీరు అందించడమే ప్రభుత్వ ద్యేయం అని,మంజీర మంచి నీటి పైప్ లైన్ నిర్మాణ పనులకు ఈ రోజు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని,ఎన్నో సంవత్సరాల నుండి నెలకొన్న సమస్య నేటి తో తీరునని కాలనీ వాసుల కోరిక మేరకు కొత్త పైప్ లైన్ వేయటం జరిగినదిఅని, ఎన్నో ఏండ్ల నీటి సమస్యనుండి విముక్తి లభించింది అని ఇకనుండి సురక్షిత మంచినీరు ఇవ్వడం



జరుగుతుందని కాలనీ వాసుల సమస్య నేటి నుడి తీరనుందని చెప్పటం జరిగినది. ప్రతి ఇంటికి మంచి నీటి నల్ల కనెక్షన్ ద్వారా నీటి సరఫరా చేపట్టడం జరుగుతుందని మరియు ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచి నీటి ని ఇవ్వడం జరుగుతుందని ,మంచి నీటి సమస్య తలెత్తకుండా పవర్ బోర్ల ద్వారా కూడా సరఫరా చేస్తున్నామని . నియోజకవర్గం లో 18 రిజర్వాయర్ లు నిర్మాణం చేసుకున్నామని .ప్రజల దాహార్తిని తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ,ప్రజలకు స్వచ్ఛమైన త్రాగు నీరు అందించడమే ధ్యేయం అని ,మరియు నియోజకవర్గం లో పూర్తి స్థాయిలో మంచినీటిని అందిస్తామని చెప్పడం జరిగినది అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రై బజార్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :** హయత్‌నగర్ జాతీయ రహదారి పక్కన, సీఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన “డ్రై బజార్” స్టోర్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్టోర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తూ సంస్థ మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, నాయకులు లింగారెడ్డి, హరీష్ రెడ్డి, పలువురు స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## చండూరు ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ చెరుపల్లి ఆంజనేయులు





**చండూరు జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :**
చండూరు ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ గా ఉన్న కోడి సుష్మ, చండూరు మున్సిపాలిటి కౌన్సిలర్ గా ఎన్నిక అయి ఉన్నందున చండూరు ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో శనివారం చండూర్ ఎఫ్ ఎస్ సి ఎస్ నాన్ ఆఫీసియల్ సభ్యుల నుండి ఒకరిని చైర్మన్ గా ఎన్నుకునే కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు నిర్వహించారు..గట్టుపల్ గ్రామానికి చెందిన డైరెక్టర్ చెరుపల్లి ఆంజనేయులు ను చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా అతనిని ఎనిమిది మంది డైరెక్టర్లు ఆమోదించడంతో చైర్మన్ గా ఎంపికయ్యారు... ఎంపిక ప్రక్రియను జిల్లా సహకార శాఖ అధికారి ఆదేశాల మేరకు ఎఫ్ ఎస్ సి ఎస్ అధికారులు ఈ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేశారుచండూరు ఎఫ్ ఎస్ సి ఎస్ లో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా గట్టుపల్ కు చెందిన దుబ్బ రాములు అనే డైరెక్టర్ డిఫాల్ట్ అవ్వడం, కోడి సుష్మ కౌన్సిలర్ గా ఎన్నిక కావడంతో 11 మంది డైరెక్టర్లు ఉన్నారు.. వీరిలో 8 మంది చెరుపల్లి ఆంజనేయులకు ఆమోదం తెలపడంతో చెరుపల్లి ఆంజనేయులు ను చైర్మన్ గా ఎంపిక చేయడం జరిగింది
చైర్మన్ ఎంపికైన చెరుపల్లి ఆంజనేయులకు, మాజీ చైర్మన్ కోడి సుష్మ, పాటు డైరెక్టర్లు చండూరు మండల, పట్టణ,ప్రముఖులు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ డిసిసిబి మాజీ అధ్యక్షులు కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, పట్టణ నాయకులు, చండూర్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడి -ఆరుగురు అరెస్ట్




**నాగారం, జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)**
మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని కుందన్‌పల్లి గ్రామ శివారులో ఓఆర్ఆర్ సమీపంలోని ఒక దొండతోటలో ప్రభుత్వం నిషేధించిన మూడు ముక్కలాట (పేకాట) నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు కీసర పోలీస్ శనివారం 20వ తేదీ మధ్యాహ్నం సమయంలో ఆకస్మిక దాడి నిర్వహించారు.పోలీసు బృందం సంఘటనా స్థలానికి చేరుకోగా కొందరు వ్యక్తులు డబ్బులు పెట్టి మూడు ముక్కలాట ఆడుతూ కనిపించారు. పోలీసులను గమనించిన వెంటనే వారు పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి మొత్తం రూ.19,320ల నగదు, 6 సెల్‌ఫోన్లు మరియు 2 సెట్ల ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో నడింపల్లి రామకృష్ణ (57), లక్ష్మీనగర్ కాలనీ, బండ్లగూడ. ముదునూరి కృష్ణంరాజు (42), దత్తాత్రేయ నగర్, ఘట్‌కేసర్. నడింపల్లి సూర్యనారాయణ (40), రామలింగేశ్వర కాలనీ, కీసర. చిలుగూరి రామరాజు (59), హెచ్ఎంటీ స్వర్ణపురి నగర్, మియాపూర్. గుంటూరి రాధాకృష్ణరాజు (55), రామలింగేశ్వర కాలనీ, కీసర. ఇందుకూరి శ్రీహరి (55), కరీంగూడలు ఉన్నారు.పోలీసుల విచారణలో నిందితులు తాము డబ్బులు పెట్టి ప్రభుత్వం నిషేధించిన పేకాట ఆడుతున్నట్లు అంగీకరించారు.
ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కీసర పోలీసులు తెలిపారు. ప్రజలకు విజ్ఞప్తి:
ప్రభుత్వం నిషేధించిన జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం ఉన్నట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కీసర సిఐ అర్కపల్లి ఆంజనేయులు కోరారు.

## ప్రియుడు మోజులో పడి కన్నకొడుకు చంపిన తల్లి...



**నాగారం, జూన్ 20:-(జర్నలిస్ట్ డైరీ)**
కీసర పోలీస్ స్టేషన్ పరిధి లోని చీర్యాలలో ప్రియుడి మోజులో పడి కన్నకొడుకుని హతమార్చిన తల్లి ..20 రోజుల క్రితం జరిగిన సంఘటన ఇది. చీర్యాలలో నివాసం ఉంటున్న భార్యాభర్తలు ప్రియుడు మోజులో పడి కొడుకును చంపేసి అనారోగ్యంతో చనిపోయిందని కుటుంబ సభ్యులను నమ్మించి సొంతూరై నా జగదేవపూర్ లో కుటుంబ సభ్యులతో అంత్యక్రియలు నిర్వహించారు. భర్తకు అనుమానం వచ్చి కీసర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు . కేసు నమోదు చేసుకొని పోలీసులు ప్రియుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చిన్న పిల్లాడి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టమ్ చేసారు. ప్రియుడు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# షాద్‌నగర్‌లో ఎస్సీ,ఎస్టీ,బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

**-15 ఏళ్లుగా అద్దె భవనాల్లోనే విద్యార్థుల అవస్థలు**

**-నిర్లక్ష్యం కొనసాగితే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవు**

**-ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ**



**రంగారెడ్డి జిల్లా జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :**
షాద్‌నగర్ పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల హాస్టళ్లకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ హాస్టళ్లు మాత్రం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. షాద్‌నగర్ పట్టణంలో ఎస్సీ ప్రీ-మెట్రిక్ బాలికల హాస్టల్, ఎస్టీ ప్రీ-మెట్రిక్ బాలుర హాస్టల్, బీసీ ప్రీ-మెట్రిక్ బాలుర హాస్టల్, పోస్ట్ మెట్రిక్ ఎస్సీ బాలుర హాస్టల్‌తో పాటు బీసీ, ఎస్టీ బాలురు, బాలికల హాస్టళ్లు కలిపి మొత్తం ఏడు హాస్టళ్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని విమర్శించారు. సరైన బాత్‌రూమ్‌లు, భద్రతా ఏర్పాట్లు, కిటికీలు, బట్టలు ఆరబెట్టుకునే సదుపాయం, విశాలమైన చదువు గదులు వంటి సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.అద్దె భవనాల యజమానులకు నెలల తరబడి అద్దెలు చెల్లించకపోవడంతో గతంలో హాస్టళ్లకు తాళాలు వేసిన ఘటనలు కూడా జరిగాయని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యకు పెద్దపీట వేస్తామని చెప్పిన ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని ఆరోపించారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హాస్టళ్ల సమస్యలపై మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఇకనైనా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్పందించి శిథిలావస్థలో ఉన్న హాస్టళ్ల స్థానాల్లోనే నూతన భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు జోగు నాగభూషణ్ మాదిగ, కల్లేపల్లి బాలరాజు మాదిగ, నాగర్‌కుంట మహేందర్ మాదిగ, సంగెం శ్రీనివాస్ మాదిగ, సంగెం మచ్చేందర్ మాదిగ, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ జరగాల్సిందే..!

**-షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్**

**-మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్‌కు వినతిపత్రం అందజేసిన ఆర్.ఎన్. రాము**



**రంగారెడ్డి జిల్లా జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :**
షాద్‌నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఆర్.ఎన్. రాము, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం దృష్ట్యా చౌరస్తా విస్తరణ అత్యవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు.వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, షాద్‌నగర్ పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండటంతో పాటు వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా జాతీయ రహదారి, బెంగళూరు రహదారి, స్థానిక రోడ్ల నుంచి వచ్చే వాహనాలతో ప్రధాన చౌరస్తా వద్ద తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. చౌరస్తా పరిసర ప్రాంతాల్లో ఉన్న పాత నిర్మాణాలు, ఆక్రమణల కారణంగా రహదారి ఇరుకుగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి పలువురు చనిపోయారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు చౌరస్తా విస్తరణ పనులను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, షాద్‌నగర్ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంపై తాము ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని అన్నారు.
గతంలో చౌరస్తా విచితములకు 45 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని అప్పట్లో కొందరు నాయకులు 45 కోట్లు ఏం సరిపోతాయని ప్రకటనలు కూడా చేశారని కొంతమంది కోర్టుకు వెళ్లడం మరి కొంతమంది ఇబ్బందులు సృష్టించడం వల్ల అప్పుడు పనులు చేపట్టలేకపోయారని గుర్తు చేశారు. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా చౌరస్తా విస్తరణ జరగాల్సిన అవసరం ఉందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంబంధిత అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.
షాద్‌నగర్ అభివృద్ధిలో కీలకమైన ఈ సమస్యను ప్రభుత్వం, సంబంధిత శాఖలు అత్యవసరంగా పరిగణించి చర్యలు చేపట్టాలని ఆర్.ఎన్. రాము కోరారు.

# వర్షాకాల సన్నద్ధత-సమన్వయ సమావేశం





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 20 (జర్నలిస్ట్ డైరీ) :**
శనివారం నాడు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో వర్షాకాల సన్నద్ధతకు సంబంధించి ఒక సమన్వయ సమావేశం నిర్వహించబడింది. షాద్‌నగర్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో షాద్‌నగర్ ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్, మండల పంచాయతీ అధికారి మరియు రెవెన్యూ, సాగునీటి పారుదల, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. వరదలు మరియు నీటి నిలకడకు అవకాశమున్న ప్రాంతాలను గుర్తించడం మరియు సంబంధిత శాఖలకు అవసరమైన నివారణ సూచనలు జారీ చేయడంపై సమావేశంలో చర్చలు జరిగాయి.అనంతరం, పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సాగునీటి పారుదల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు గ్రామ ప్రతినిధులతో కలిసి అయ్యవారిపల్లి వాగు వద్ద సంయుక్త తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా వరద ముప్పు పొంచి ఉన్న స్థానాలను గుర్తించి, అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయడం, రాత్రి వేళల్లో హెచ్చరికల కోసం రిఫ్లెక్టివ్ బోర్డులు అమర్చడం మరియు ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించడంపై సంబంధిత శాఖలకు అత్యధిక ప్రాధాన్యతపై చర్యలు చేపట్టాలని సూచనలు జారీ చేశారు.
వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు మరియు శాఖల మధ్య సత్వర సమన్వయం సాధించేందుకు, సంబంధిత అన్ని అధికారులతో కూడిన ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయడమైంది. ఇది క్షేత్రస్థాయిలో తక్షణ సమాచార మార్పిడికి మరియు అంతర్-శాఖీయ సహకారానికి దోహదపడనుంది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# సోషియో ఫాంటసీగా నాగబంధం

## -ట్రైలర్‌ను విడుదల చేసిన చిత్ర బృందం




యువ నటుడు విరాట్ కర్ణ, గ్లామరస్ బ్యూటీ నభా నటేష్ జంటగా నటిస్తున్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం' ట్రైలర్‌ను చిత్ర బృందం ఘనంగా విడుదల చేసింది. హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పిసిఎక్స్ థియేటర్‌లో యూనిట్ సభ్యుల సమక్షంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. అభిషేక్ పిక్చర్స్, ఎన్‌ఐకే స్టూడియోస్ పతాకాలపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు ఈ సినిమాతో దర్శకుడిగా మారారు. ట్రైలర్‌లో చూపించిన విజువల్ ఎఫెక్ట్స్ అన్నీ తెలుగు సాంకేతిక నిపుణులే రూపొందించడం విశేషం. పురాతన ఆలయాలు, గ్రాఫిక్స్ విజువల్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మన పురాతన విష్ణు ఆలయాలు, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలు, సనాతన ధర్మం మరియు చారిత్రక అంశాల నేపథ్యంలో మైథాలజీ అడ్వెంచర్ స్పెక్టకిల్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమాలో విరాట్ కర్ణ శివ తరహా మాస్ లుక్‌లో కనిపించనుండగా, చాలా రోజుల తర్వాత నభా నటేష్ పవర్‌ఫుల్ పాత్రలో మెరవబోతోంది. వీరితో పాటు ఐశ్వర్యా మీనన్, జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జునైద్ కుమార్ మరియు అబీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు భారీ హైప్ తీసుకొచ్చింది విజువల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు గ్రాండ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని, ప్రతి రూపాయి తెరపై స్పష్టంగా కనిపిస్తుందని దర్శకుడు అభిషేక్ నామా తెలిపారు. మన పురాతన ఆలయాలు, వాటి వెనుక ఉన్న చరిత్రను తర్వాత తరాలకు తెలియజేసేలా ఈ సినిమా ఉంటుందని హీరో విరాట్ కర్ణ చెప్పారు. 'నాగబంధం' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు మలయాళం, తమిళం, హిందీ భాషల్లో జూలై 03న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## మా ఇంటి బంగారం

# ఓపెనింగ్ కలెక్షన్స్ అదుర్స్




సమంత ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' థియేటర్లలో సాలిడ్ ఓపెనింగ్ సాధించింది. ట్రేడ్ వర్గాల ప్రకారం ఈ చిత్రం తొలిరోజు భారతదేశంలో రూ.5.35 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఇండియా గ్రాస్ కలెక్షన్ సుమారు రూ.6.20 కోట్లుగా నమోదుకాగా. దేశవ్యాప్తంగా 2,658 షోలలో ఈ సినిమా ప్రదర్శితమైంది. ఓవర్సీస్ మార్కెట్ నుంచి మరో రూ.4.50 కోట్ల గ్రాస్ రావడంతో తొలిరోజు వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ.10.70 కోట్లకు చేరింది. రిజియన్ వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి రూ.4.75 కోట్ల గ్రాస్‌తో టాప్‌లో నిలిచాయి. కర్ణాటకలో రూ.90 లక్షలు, తమిళనాడులో రూ.38 లక్షల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి. తెలుగు 2ఆ వెర్షన్‌కు ఆక్యుపెన్సీ రోజంతా పెరుగుతూ వచ్చింది. ఉదయం షోలకు 26.15 శాతం ఉన్న ఆక్యుపెన్సీ, రాత్రి షోలకు 51.38 శాతానికి చేరింది. ప్రీమియం తెలుగు ఇఖఎఖి ఫార్మాట్‌కు 96 శాతం ఓవరాల్ ఆక్యుపెన్సీ నమోదైంది. హైదరాబాద్‌లో దాదాపు హౌస్‌ఫుల్స్ పడగా, రాత్రి షోలకు 100 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది. 'ఖుషి' 2023 తర్వాత సమంత తెలుగు సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఆ అంచనాలను నిజం చేస్తూ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుష, శ్రీముఖి,శ్రీలక్ష్మి కీలక పాత్రల్లో నటించారు.

# ఓటిటిలోకి అర్జున్ బ్లాస్ మూవీ




చాలా రోజుల తర్వాత అర్జున్ తన యాక్షన్‌తో మెప్పించిన చిత్రం 'బ్లాస్ట్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ప్లిక్స్ వేదికగా జూన్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ప్లిక్స్ అధికారికంగా వెల్లడించింది. కొన్ని రోజులుగా దీని ఓటీటీ తేదీపై వార్తలు వస్తున్నప్పటికీ నేడు నెట్‌ప్లిక్స్ అధికారిక తేదీని వెల్లడించింది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రీతీ ముకుందన్, అభిరామి, అర్జున్ చిదంబరం తదితరులు నటించారు.

# సోషల్ మీడియాకు గుడ్‌బై చెప్పిన 'ఫంకీ' నటి.. కారణం ఇదే!



ప్రముఖ నటి కయాదు లోహర్ సోషల్ మీడియాకు తాత్కాలికంగా దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. శరీరానికి ఎలా విశ్రాంతి అవసరమో మనసుకు కూడా అలాంటి బ్రేక్ కావాలని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులకు వెల్లడించింది. కొంతకాలం స్క్రీన్‌కు దూరంగా ఉంటూ నిజ జీవితంతో మమేకం కావాలని, తనతో తాను ఎక్కువ సమయం గడపాలని అనుకుంటున్నట్లు ఆమె తెలిపింది. ఈ విషయంపై కయాదు ఇన్‌స్టాలో పోస్ట్ పెడుతూ.. "సోషల్ మీడియా నుంచి చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు మనం శరీరానికి ఇచ్చే విశ్రాంతి మనసుకు కూడా అవసరం. నేను కాస్త నెమ్మదించి, డిస్‌కనెక్ట్ అవ్వాలని, స్క్రీన్‌కు అవతల ఉన్న జీవితంతో, నాతో నేను ఎక్కువ సమయం గడపాలని భావిస్తున్నాను" అని రాశారు. ఇన్నిరోజులు నాకు మద్దతుగా నిలిచి, ప్రోత్సహించిన, దయ చూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రేమ, సందేశాలు నాకు ఎంతో విలువైనవి. నేను కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉంటాను, కానీ ఏవైనా ముఖ్యమైన అప్‌డేట్స్ ఉంటే నా టీమ్ ఈ ఖాతా ద్వారా పంచుకుంటుంది. అందరూ సంతోషం, దయతో ఉండాలని కోరుకుంటున్నాను. త్వరలో కలుద్దాం అని పేర్కొన్నారు. సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే ఫంకీతో అలరించిన ఈ భామ తెలుగులో నాని సరసన ది ప్యారడైజ్ చిత్రంలో నటిస్తుంది. ఇదే కాకుండా దర్శకుడు మరియప్పన్ చిన్న తెరకెక్కిస్తున్న తమిళ్ హారర్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్'లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమెకు జోడీగా నటుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాలో టీఎం కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు.

# కాక్‌టెయిల్ 2 కుటుంబ కథా చిత్రం



షాహిద్ కపూర్ హీరోగా రష్మిక, కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కాక్‌టెయిల్ 2' . ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలో దీని సెన్సార్ సర్టిఫికెట్‌పై షాహిద్ కపూర్ మాట్లాడారు. ఇది కుటుంబకథా చిత్రమని దీనికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో అర్థం కాలేదని అన్నారు. సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించిన ఆయన దీని గురించి మాట్లాడారు. 'ఈ సినిమాలో అభ్యంతరకరమైన, అసభ్య సన్నివేశాలు ఏవీ లేవు. సినిమా మొత్తంలో అలాంటిది ఒక్క సీన్ కూడా ఉండదు. అలాంటి చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆలోచిస్తూనే ఉన్నాను. ఎంత ప్రయత్నం చేసినా నాకు అర్థం కావట్లేదు. ఇది ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగే కథ. కుటుంబ సభ్యులందరితో కలిసి చూసే చిత్రం అని స్పష్టం చేశారు. ప్రేక్షకులు ఈ సినిమా చూసి థియేటర్ నుంచి నవ్వుతూ బయటకు వస్తారని ఆయన అన్నారు. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా లెస్బియన్ లవ్‌స్టోరీ అంటూ జరిగిన ప్రచారాన్ని కూడా కృతిసనన్ తాజాగా ఖండించారు. ఈ చిత్రం ముగ్గురు ప్రధాన పాత్రల చుట్టూ తిరిగే ఓ ఎమోషనల్ డ్రామా అని చెప్పారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు రూ.13 కోట్లు వసూలుచేసినట్లు చిత్రబృందం తెలిపింది. ఈ వీకెండ్ కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465